# 6

# సంక్రాంతి పురుషుడు రైతు రామయ్య

క్రాంతిలేని సంక్రాంతి.

సంక్రాంతి లేని క్రాంతి.

ఒకటి ఉంటే రెండోది వుండదు.

రెండూ లేకపోతే...

రెండూ లేనివాళ్లు స్వతంత్ర భారతంలో అధిక సంఖ్యాకులు.

ఈ పుణ్యభూమి, ఈ పండగలభూమి, పల్లెసీమల భూమి రెండూ లేనివాళ్లది. వాళ్ళు కనిపిస్తారు, సంక్రాంతి రోజులలో. మిగతా రోజులలో వాళ్లు లేరాయేం ? ఉన్నారు. కనిపించరు. అధికసంఖ్యాకులే అయినా కనిపించరు. ఏం, యెందుకని ? సంక్రాంతి కాదు కనుక

అల్పసంఖ్యాకులు అధిక సంఖ్యాకులను చూడరు. చూచినా వాళ్ల సంగతి పట్టించుకోరు. ఈ అధికసంఖ్యాకుల కథ మొదలూ, చివరా లేని కథ. అధికసంఖ్యాకులల్లా అల్పసంఖ్యాకులయేంత పెద్దకథ. అంతకథ ఎవరు చదవగలరేం? చదివేవాళ్లుంటే మాత్రం చెప్పేవాళ్లు ఉండవద్దూ? ఉంటారు. ఉన్నారు. అటువంటి వాళ్లల్లో రైతు రామయ్య గారొకడు. తన జీవితంలో అరవై సంక్రాంతి పండుగలు చూచాడు రైతు రామయ్యగారు.

రామాయపాలెం పొలాలన్నీ తుమ్మబీళ్లుగా ఉండే రోజులలో చౌదరయ్య అల్లుడుగా వచ్చాడు రైతురామయ్య. చౌదరయ్యకు చెప్పుకోతగ్గంత ఆస్తిలేదుగాని కావలసినంత పేరు ఉన్నది. పేరుతో పాటు అప్పులు కూడా పెరిగి ఆయన పోయేప్పటికి ఐదెకరాల మెట్ట మిగిలింది. మగపిల్లలు లేరు. కామాయమ్మ ఒక్కతే కూతురు. ఆ అయిదెకరాల మెట్ట రామయ్యకూ కామాయమ్మకూ వచ్చింది. పొలం అయితే వచ్చిందికాని, ఆ అయిదెకరాలలోనూ పుట్టెడు జొన్నలు వచ్చేప్పటికి తలప్రాణం తోకకు వచ్చిన రోజులవి. బతికినన్నాళ్ళూ చౌదరయ్య దర్జాగానే బతికాడు. ఎట్లాబతికాడో ఎవరికీ తెలియదు. అదంతేగా! బాగా జరిగినన్నాళ్ళూ ఎట్లా జరుగుతుందో ఎవరికీ అవసరం లేదుగదా?

తీరా చౌదరయ్య వచ్చిన తరువాత సంసారం బయటపడే పరిస్థితి వచ్చినరోజులలో రామయ్య వట్టిరామయ్యే. రైతు రామయ్య కాదు. రెండెకరాలలో యాభై తుమ్మల

నమ్మి మామ అపరకర్మలను పూర్తిచేసి...ఆతరువాత ఏమి చేదామా అని ఆలోచిస్తూండగానే కామాయమ్మ కడుపు పండింది. భూమాత పండకపోయినా భారతమాతల కడుపులు పండుతూనే ఉంటయ్ గదా ? చేలో పంటకు చీడ వస్తుంది. అట్లాగే కడుపులో పంటకూ రకరకాల జబ్బులు వస్తయ్. ప్రాణంమీదికి తెస్తయ్. నిండు యవ్వనంలో ఉన్న రామయ్య అలమటించి పోయినాడు. ఊళ్లో వైద్యం లేదు. పూజారి ఆచార్లు 'ఇటువంటివి నాకు తెలియదు, పొ'మ్మన్నాడు. చివరికి జబ్బేమిటో అయినా తెలియలేదు. అటువంటి స్థితిలో ఒక స్నేహితుడి సలహా విని మేనాలో వేసుకొని గుంటూరు కుర్ల ఆసుపత్రికి తీసుకు వెళ్లాడు కామాయమ్మను రామయ్య.

మరేం ఫరవాలేదన్నారు అక్కడి డాక్టరమ్మలు. నెలగోజులలో పండంటి కొడుకు నెత్తుకుని స్వగ్రామానికి వచ్చింది కామాయమ్మ. ఆమెతోపాటే ఒక బైబుల్ గ్రంథం కూడా రామయ్య ఇంట్లోకి వచ్చింది. ఊళ్ళోకి ఒక బోధకుడుకూడా వచ్చాడు. చచ్చిపోతుందనుకున్న తన భార్యను బతికించారు డాక్టరమ్మలు. రామయ్యకు బలే సంతోషం వేసింది. ఇరవయ్యేండ్ల కామాయమ్మ తెలుగు బైబుల్ చదవటం రామయ్యకు ఇంకా సంతోషం కలిగించింది. అందుకనే మతబోధకుడికి ఆతిథ్యం ఇచ్చాడు. ఆతిథ్యం అంటే తన ఇంట్లో ఏమి ఉన్నది కనుక! ఉన్నంతలో లోటు లేకుండా మర్యాదచేశాడు బోధకుడికి.

రామయ్య ఇంటిదగ్గరే బోధకుడు రోజూ రాత్రిపూట మతప్రచారం ప్రారంభించడంతో ఊళ్ళో కలవరం బయలు దేరింది. అంతవరకూ మతం మారడం అనేది చెయ్యరానిపని అని రామయ్యకు తెలియదు. అసలు మతం అంటే యేమిటో తెలియనంత అమాయకంగా హాయిగా బతికాడు రామయ్య. అవన్నీ తెలుసుకోవలసిన అవసరం రామయ్యకు అంతవరకూ కలుగలేదు మరి. తీరా ఈ మతబోధకుడు తన ఇంటిదగ్గర మతప్రచారం ప్రారంభిస్తే ఊళ్లో వాళ్ళందరికీ కోపం వచ్చింది.

ఇదేంఖర్మ? శాస్తుర్లుగారు పురాణం చెపితే వినే వాడు తను, చిన్నప్పుడు, తనవూళ్లో. అట్లాగే ఈయన కూడా ఏసుక్రీస్తుకథ చెపుతున్నాడు. తను వింటున్నాడు. తనభార్య మతం మారిందని అంటున్నారు. ఏమి మారింది? ఏమీ మారలేదే? మంచినీళ్ళప్రాయంగా పుస్తకాలు చదువుతోంది; పొద్దునా రాత్రీ ప్రార్థనలుచేస్తుంది. అంతేగా! యేం చేస్తే! ఇందులో మతం మారడం ఏమిటీ? అదివరకు మాదిరిగానే కామాయమ్మ తనతో పొలంవచ్చి పని చేస్తోంది. అదివరకటి మాదిరిగానే ఇంట్లో పనిచేస్తోంది. తీరిక చేసుకొని బైబిల్ చదువుతోంది. ఇదంతా తన సంసారం సంగతి. ఊళ్ళోవాళ్ళ కెందుకూ?

ఊళ్ళోవాళ్ళంటే యెవరూ? తనమాదిరి సన్నకారు రైతులలో చాలామందికూడా రాత్రిపూటవచ్చి బోధకుడు చెప్పే సంగతులు వింటున్నారు. కూలీలు కూడా వస్తున్నారు. పోతే మున్సబు సుబ్బయ్యకూ, కరణంకోటయ్యకూ కొంచెం

ఏవగింపుగా ఉన్నది. వాళ్ళిద్దరికీ కోపంవస్తే కష్టమే. కాని, తనేంజేయగలడూ? ఇందు తను చేయగలిగిందిమాత్రం ఏమున్నది - అనుకొంటుండగానే మొదట రామాయపాలెం వచ్చిన బోధకుడే కాలవకట్టమీద ఓ పాక వేసి బడిపెట్టాడు. కూలీల పిల్లలూ, పాటకజనం పిల్లలూ బళ్లోకి వెళ్ళేవాళ్లు. రెండు సంవత్సరాలలో ఆ బడి పెద్దబడి అయింది. పెద్ద భవనం కట్టించారు. దానికి ప్రారంభోత్సవం చేసేందుకు ఇద్దరు దొరలు వచ్చారు.

దొరలంటే దొరలే. చాలా తమాషా మనుషులు. వాళ్ళకోసం రామయ్యేమీ హంగామా చేయనవసరం లేకపోయింది. అన్నీ వాళ్ళే తెచ్చారు. రొట్టెలు తెచ్చారు. మిఠాయి తెచ్చారు. నీళ్ళలో అదేదో పొడి కలిపి పాలు చేశారు. కాఫీ తాగారు. వాళ్ళుతిని రామయ్యకూ, వాళ్ళను చూడడానికి వచ్చినవాళ్లకూ పెట్టారు. బావిదగ్గర నీళ్ళు తోడడం దగ్గరనుంచి అన్నిపనులూ వాళ్ళే చేసుకున్నారు.

ఊరు ఊరంతా కదిలివచ్చింది - వాళ్లనూ, వాళ్ల మోటారు కార్లనూ చూచేందుకు. అదివరకల్లా చాటునా మాటునా ఏవగించుకొంటున్న మున్సబు, కరణము, షావుకారు సోమయ్య-అందరూ వచ్చారు. అదో పెద్దసంబరం అయింది.

దొరలు అంతటితో ఊరుకున్నారా? ఊరుకోలేదు. 'మీ పొలాలు చూడా'లన్నారు, వచ్చీరాని తెలుగులో. 'అయ్యో! వీళ్ళను ఆ పొలాల్లోకి తీసుకు వెళ్ళాలీ!' అని

రామయ్య ఆలోచిస్తూండగానే వాళ్ళే ముందు దోవతీశారు. పొద్దుకూకేదాకా పొలాలన్నీ గబగబా కలయ తిరిగారు. ఇద్దరు దొరలూ, విచిత్రం. 'జొన్న అన్నం వీళ్ళకు సయిస్తుందా' అనుకున్నారు ఊళ్ళోవాళ్లు. కాని, చెంచాలతో జొన్నన్నం తిన్నారు, దొరలు. పెరుగు తిన్నారు, దొరలు. తినడం అంటే రుచిచూచారు. అంతవరకే. ఊళ్ళోవాళ్ళచేత దొరలు దమ్మిడీ అయినా ఖర్చు చేయించలేదు. పైగా పిల్లలకు మిఠాయి పంచిపెట్టారు.

కొంతమంది పాటక జనానికి సన్నటిగుడ్డలు పంచిపెట్టారు. అంతేకాని మతంసంగతి మాట్లాడలేదు. మన దేవుళ్ళను తిట్టలేదు. దొరలు ఊళ్ళోఉన్న ఆమూడురోజులూ ఓ పెద్దసంక్రాంతి అనిపించింది. రామయ్యకేకాదు—ఇంకా చాలా మందికి.

అదంతా ఈనాడుకూడా రైతు రామయ్యకు చక్కగా గుర్తున్నది. నెలరోజులలో పెద్దపెద్ద రంపాలతో, ఇంకా యేవేవో ఇంజన్లతో మళ్లీ ఊళ్ళోకి వచ్చారు దొరలు. ఈసారి రామయ్యకు భయంవేసింది. 'ఈ రంపా లెందుకూ' అనుకున్నాడు. వస్తూనే దొరలు రామయ్యచేలో బావిదగ్గరికి దోవతీశారు. వాళ్లువచ్చిన రెండోరోజుకల్లా పెద్దపెద్ద గొట్టాలూ, ఇంకా కొన్ని సామాన్లూ వచ్చినవి. నాలుగోరోజుకల్లా మోటబావిదగ్గర ఒక ఇంజను అమర్చారు దొరలు. సులభంగా తుమ్మచెట్లను నరికేపద్ధతి చూపించారు. రామయ్యకు మిగిలిన అయిదెకరాలలోనూ మూడెక

రాలలో తుమ్మచెట్లన్నీ పడిపోయినవి. వారంరోజులలో దున్నలతో నాగలిదున్నించ నారంభించారు దొరలు. ఇదంతా దేనికంటే, వాళ్ళు ఏదో చెప్పారు. రామయ్యకు సరిగా అర్థంకాలేదు. రెండునెలల్లో రామయ్య అయిదెకరా ల్లోనూ పసుపుమొక్కలు మొలిచినవి. ఊళ్ళోవాళ్ళకు ఇదంతా చాలా ఆశ్చర్యం కలిగించింది. గారడీగా కనిపించింది.

ఈపను లన్నింటిలోనూ రామయ్యా, కామా యమ్మా కూడా దొరలతోపాటు పనిచేశారు. మొక్కలు మొలవడం మొదలెట్టిన తరువాత దొరలు మళ్ళీవచ్చారు. బస్తాలతో ఏదో పొడితెచ్చి మొక్కలకు చల్లారు. వాళ్లు పసుపు వేసిన పద్ధతికీ, ఇతరత్రా పసుపు తోటలకూ చాలా తేడా ఉన్నది. ఏమైతే నేం, పసుపు పుష్కలంగా పండింది. పంట పండేనాటికి మళ్ళీ దొరలు వచ్చి కొత్తపద్ధతిలో పసుపు ఊడ్పించారు. ఆరపెట్టించారు. ఆరిన పసుపును బస్తాల కెక్కించి లారీలలో వేసుకు తీసుకు పోతుంటే రామయ్యకు ఇదంతా ఓ పెద్ద ఇంద్రజాలంగా కనిపించింది. కాని రెండు నెలల్లో మళ్ళీ దొరలు వచ్చారు. వస్తూనే కామాయమ్మనూ, కొడుకునూ పిలిచి ఓపెద్ద కవరు ఇచ్చారు. కవరును ఏసు క్రీస్తు పటానికి చూపించి, కళ్ళకు అద్దుకొన్నది కామా యమ్మ. ఆ తరువాత చింపి చూసింది...ఆశ్చర్యం. అన్నీ వందరూపాయల నోట్లు! రెండువేల రూపాయ లొచ్చినవి రామయ్య చేలో పండిన పసుపుకు. అంతవరకూ అంతడబ్బు రామయ్య చూడలేదు ఇదివరకెన్నడూ. ఆనాడు రామయ్య జీవితంలో క్రాంతీ, సంక్రాంతీ ప్రవేశించినవి.

అయిదెకరాలల్లా ఏడేండ్లలో యాభై ఎకరాలయింది. ఇద్దరు కొడుకులు. ముగ్గురు కూతుళ్ళు. నాలుగుజతల ఎడ్లు. మూడు బర్రెలు. రామయ్య రైతురామయ్య అయ్యేప్పటికల్లా ఊళ్ళో బడికూడా హైయర్ ఎలిమెంటరీ స్కూలయినది. క్రైస్తవాలయం యేర్పడింది. ఊళ్ళో చాలామంది ఆదివారంనాడు అక్కడికి వెళ్ళి ప్రార్థనచేస్తారు. పట్టింపులు పోయినయ్. తుమ్మ బీళ్ళన్నీ పసుపుతోట లయినయ్. పాటకజనానికి తియ్యకుండా పనీ, తిండీ దొరుకుతున్నయ్.

రామాయపాలెంలోనేకాక ఇరుగు పొరుగు ఊళ్ళల్లో కూడా రైతురామయ్య నిజంగా పెద్దమనిషి అనిపించుకున్నాడు. పెద్దకొడుకు బియ్యేదాకా చదివాడు. పెళ్ళి వద్దంటే వద్దన్నాడు. ఆడపిల్లలు ముగ్గురూ అత్తవారిళ్ళకు వెళ్ళారు. కలిగినవాడికి జరిగే మర్యాదలన్నీ రైతు రామయ్యకు జరిగినవి. అదంతా మామూలుసంగతి. అందులోనే సంక్రాంతి. ఒక్కసంక్రాంతికాదు. రకరకాల సంక్రాంతులు! రైతు రామయ్య పేరుచెప్పితే దొరలదగ్గర, ప్రభుత్వందగ్గర కానిపని అంటూ ఉండదని మార్మోగిపోయింది.

రెండో కొడుకు కూడా బుద్ధిమంతుడే. ఎమ్. ఏ. లో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడైనాడు. పెద్దకొడుకు ఇంటిదగ్గరే వ్యవసాయం చేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలకూ తలా అయిదేసి ఎకరాలూ, అయిదేసివేలూ ఇచ్చాడు రామయ్య. అంతేకాని, పూర్వీకుల నాటి తనఇంటిని బాగు చేయించుకోలేదు. ఊళ్ళోబడికోసమని ఐదెకరాల భూమిని సేకరించి

రిజిస్టరు చేయించాడు.

రైతు రామయ్యమాటకు ఎదురులేదని జిల్లాఅంతటా మార్మోగిపోతున్న రోజులలో కామాయమ్మ మరణించింది. నాయింటి లక్ష్మి పోయిందని వలవలా యేడ్చాడు రామయ్య, చిన్నపిల్లవాడి మాదిరిగా. లాలించేందుకు ఆనాటి దొర లెవరూ రాలేదు.

కామాయమ్మ పోయేనాటికే దేశంలో వచ్చిన మార్పులు మెల్లిమెల్లిగా ఊళ్ళోకి కూడా ప్రవేశించినవి. మనుషుల బుద్ధులలో మార్పు వచ్చింది. ఊళ్ళో యేమీ లేనప్పటి సంగతి వేరు. ఈనాడు పెత్తందారు లెక్కువైనారు. ఒక పెత్తందారు కమ్యూనిస్టు. ఊళ్లోకివచ్చే బాటసారుల కోసమని రామయ్య కట్టించిన సత్రం రాజకీయపార్టీల నిలయంగా మారింది. అన్నార్తులకోసమని రామయ్య ఏర్పాటుచేసిన అయిదెకరాల భూమి సంగతి మున్సబు అంతు చెప్పడు. మున్సబు అంటే కాంగ్రెసు నాయకుడు. ఊళ్ళోని బడి క్రైస్తవుల బడి అని ప్రచారం చేశారు. అది మూలపడింది. పోటీగా ఇంకోబడిని ప్రారంభించారు. బడి కోసం కేటాయించిన అయిదెకరాల భూమినీ దానికి ఇవ్వాలని తగాదా తెచ్చారు. తగాదా లంటే రామయ్యకు భయం. ఇచ్చేశాడు. ఎవరైతేనేం, బడి నడిపిస్తే సరి అని తనలో తను సరిపెట్టుకున్నాడు. తనమాట వినేవాళ్ళందరికీ నచ్చచెప్పాడు. కొత్తబడిని నడిపిస్తున్న నాయకుడు కమ్యూనిస్టని అంటారు. వీళ్ళల్లో ఎవరు కమ్యూనిస్టో, ఎవరు కాం

గ్రెసో? అసలు కమ్యూనిస్టంటే యేమిటో, కాంగ్రెసంటే యేమిటో రామయ్యకు తెలియదు. అవన్నీ తెలియకుండానే ఇన్నాళ్ళూ బతికాడు. ఇంకా కొంతకాలం బతకలేక పోతాడా ?

“బడిపొలం వాళ్లకు ఎందుకు ఇచ్చావ్? బడిని వాళ్ళు సరిగా నడిపించడం లే”దని ఊళ్ళో కొందరు తగాదా తెచ్చారు.

“సత్రంపొలం మున్సబుకు ఎందుకు ఇచ్చావ్? పదేండ్ల నుంచీ దమ్మిడీ లెక్క చెప్పడంలే”దని ఇంకా కొంతమంది తగాదా తెచ్చారు.

ఈ తగాదాలవల్ల ఊరు ఊరంతా రామయ్య కళ్ల ఎదటే రెండుగా చీలింది. పెద్దకొడుకు ఒక ముఠాకు నాయకుడని అంటున్నారు. అందుకు ఋజువుగా పెళ్ళిచేసుకొన్న నెల రోజులకే వాటా పంచిపెట్టమని అడిగాడు చిన్నకొడుకు. పెద్దకొడుకు వ్యవసాయంలోకి వచ్చినప్పటినుంచి డబ్బూ దస్కం వ్యవహారమంతా కొడుక్కు ఒప్పజెప్పాడు రామయ్య. ఓపిక ఉంటేపొలం వెళ్తాడు, లేకపోతే ఇంట్లో పడుకుని బైబుల్, రామాయణం, భాగవతం చదువుతూ పడుకుంటాడు. పెద్ద కొడుకు పొలంనుంచి వచ్చి పిలిస్తేగాని అన్నంతినడు.

అటువంటి రామయ్యకు ఊళ్ళోతగాదాల సంగతేం తెలుస్తుంది? కొడుకు వాటా అడిగితే “అన్నను అడుగు” అన్నాడు. “నువ్వు ఎందుకనియివ్వవూ” అన్నాడు కొడుకు. రెండో కొడుకంటే కామాయమ్మకు గారాబం. వలవలా యేడుస్తూ కామాయమ్మ ఫోటోదగ్గరికెళ్ళి “చూచావా...

చూచావా? నీకొడుకు ఏం అంటున్నాడో విన్నావా'' అన్నాడు రామయ్య.

ఆ సంగతి వింటూఉన్న కక్షిదారులు "మేము చెప్ప లేదంట్రా...ఆ ముసలాడికి ఎంతసేపటికీ పెద్దకొడుకు మీదే గాని నీమీదేమీ లేదురా'' అన్నారు.

ఆ పాటకు కొత్తగావచ్చిన భార్య తాళంవేసింది. ఆ సంగతి రామయ్యకు తెలిసి కుమిలికుమిలి ఏడ్చాడు.

మనుషుల బుద్ధినిబట్టే కాలం మారుతుందని అంటారు. నారింజతోటలకు చీడబట్టింది. పురుగు పాకి చెట్లు నిలువునా చస్తున్నవి. పుట్టి ఆరొందలదాకా అమ్మిన పసుపు పుట్టి రెండొందలయినా పలకడంలేదు.

అదంతా అట్లాఉండగా కృష్ణకు రెగ్యులేటర్ కట్టారు. కనుక రామాయపాలెం పొలాలన్నీ మాగాణి అయినవి.

ఊళ్ళో తగాదా లెక్కువై ఓ సంక్రాంతినాడు తలలు పగులకొట్టుకున్నారు. కోర్టు లెక్కారు. గోలపడలేక చిన్న కొడుక్కు సగం వాటా ఇచ్చేశాడు రామయ్య. "అదేం మాట? మొత్తం ఆస్తిని మూడువాటాలు చెయ్యాలి''అన్నాడు పెద్దకొడుకు. "ఓరి నువ్వెంట్రా, నే చెప్తాగా విను'' అన్నాడు రామయ్య. అంతే. పెద్దకొడుకు మళ్ళీ నోరు కదల్చలేదు. రామయ్య తాతలనాటి కొంపకు ఎదురుగానే చిన్నకొడుకు పెద్దమేడ వేశాడు. బస్తీలో ఏదో ఉద్యోగానికి వెళ్ళాడు.

చిన్నకొడుకు వేరే ఎందుకని వెళ్ళాడో రామయ్యకు తెలియదు. కొడుకును అడగలేదు. కామాయమ్మఫోటోను

అడిగాడు. అన్నం వండేందుకు కూడా మనిషి ఉన్నది, ఇంట్లో. ఏదో రోజులు దొర్లుతున్నవి లెమ్మనుకొంటూండగా ఊరిఉమ్మడి ఆస్తికి రామయ్య లెఖ్ఖ చెప్పాలని మున్సబు దావా వేశాడు. ఉమ్మడి ఆస్తి అనేదేమిటి? అంతా రామయ్యే ఏర్పాటు చేసినది. చందాలు వసూలుచేసినా, తానుఇచ్చినా మొత్తంమీద రామాలయానికీ, సత్రానికీ, బడికీ ఇరవై ఎకరాలు రామయ్య సంపాదించాడు. అయితే అది అంతా తన దగ్గరనుంచి ఇతరులకు మారికూడా ఇరవయ్యేండ్లు అవుతోంది. ఈనాడు తన దగ్గర అందుకు సంబంధించిన కాగితాలుకూడా లేవు. మరి వాళ్ళదగ్గర యేమి ఉన్నవో తెలియదు.

'ఇంత అన్యాయమా' అని ఆక్రోశపడ్డాడు పెద్ద కొడుకు. ఏం లాభం? ఆక్రోశంతో పనికాదు. పని జరగాలంటే కాగితాలు కావాలి. నమ్మకంతో పనులు కావు. కోర్టులకు వెళ్ళనంటే పని జరగదు. జరిగినా, జరిగేదేదో జరుగుతుంది. ఏమైతేనేం?? ఆదావా కారణంగా రామయ్య చాలా నష్టపడవలిసి వచ్చింది. వాస్తవానికి రామయ్యకు జరిగే నష్టమేమీ లేదని ఊళ్లోవాళ్లు అన్నారు. ఆ మాటకు వస్తే ఆస్తి అంతా రామయ్య స్వార్జితం; నష్టం అనేదే జరిగితే అదంతా రామయ్యదేనని ఇంకా కొందరు అన్నారు. ఇదంతా ఊళ్లోవాళ్ళు చేసే చర్చే గాని, దీనిలో రామయ్య జోక్యం లేదు. రామయ్య ఎవరిమాటా కాదని అనలేదు. అవుననికూడా అనలేదు. కోర్టుకు హాజరుకావడంవంటి పను

లన్నీ పెద్దకొడుకే జరిగించాడు. అదేమి చిత్రమో, చిన్న కొడుకు అసలు ఈ సంగతే పట్టించుకోలేదు. ముగ్గురు మగ పిల్లలు చిన్న కొడుకుకి. కొడుకు పిలిస్తే వెళ్లాలని అనుకుంటాడు రామయ్య.

తండ్రి వస్తానంటే తీసుకువెళ్ళాలని అనుకుంటాడు చిన్నకొడుకు. వీళ్ళ ఇద్దరిపద్ధతీ ఆడపిల్లలకు చాలా తమాషాగానే ఉన్నది. తండ్రిఎదుట అన్న సంగతి ఎత్తితే అన్న చాలా మంచివాడని అంటాడు నాన్న. మరి చెడ్డవాళ్లెవరో? తగాదా ఎక్కడో?

అసలు వీళ్ళకిద్దరికీ తగాదాయేమిటీ? తెలియదు. ఎవరికీ తెలియదు. ఎదురుపడినా ఇద్దరూ మాట్లాడుకోరు. ఎదురెదురు ఇళ్ళే అయినా రాకపోకలు లేవు. అందుకని వీళ్ళకిద్దరికీ తగాదా అని లోకం ఖాయంచేసింది.

పెద్దరైతుగా పేరున్నందున దానాలూ, విరాళాలూ తప్పవు.

పండగలకూ పబ్బాలకూ, ఊళ్ళో రాజకీయాలకూ, బీదాబిక్కీకీ కోరాక, ఏదో ముట్టచెప్పక తప్పదు. ఇంట్లో తండ్రీ కొడుకు లిద్దరు. ఈవిధంగా పది సంవత్సరాలు గడిచేప్పటికి తాతలనాటి కొంపా, పదెకరాలూ మిగిలినవి.

అదేమి తమాషాయో కానీ, నలభయ్యోయేట పెద్దకొడుకు పెళ్ళిచేసుకుంటా నన్నాడు.

ఇన్నాళ్ళకైనా అన్నయ్య పెళ్ళిచేసుకుంటా నన్నందుకు ఆడపిల్లలు సంతోషపడ్డారు. రామయ్య సరేనన్నాడు.

సంక్రాంతిముందే పెళ్ళి జరిగింది. రామయ్య జీవితంలో సంక్రాంతికి విచిత్రమైన ప్రాముఖ్యం ఉన్నది. తన పెళ్లి సంక్రాంతిముందే జరిగింది. పెద్ద ఆడపిల్ల పెళ్ళి సంక్రాంతి ముందే జరిగింది. రెండో కొడుకు పెళ్ళి సంక్రాంతిముందే జరిగింది. సంక్రాంతిముందే కామాయమ్మ తనను ఒంటరి వాణ్ణి చేసి తనదారిన తాను పోయింది. మళ్ళీ సంక్రాంతి ముందే పెద్దకొడుకుపెళ్లి. విచిత్రం! పెద్దకోడలు అచ్చంగా కామాయమ్మపోలిక !!! అన్నీ కామాయమ్మగుణాలే!

పెద్దకొడుకుపద్ధతే మారింది. అదివరకు చెడ్డగా తిరిగాడని కాదుకాని, భార్యకాపురానికి వచ్చినప్పటినుంచీ పొలంపనీ, తీరిక ఉంటే ఇంట్లోనే యేదోఒకపని కలిపించుకోడమూ తప్పితే ఊళ్ళో రాజకీయాలకు వెళ్ళటం మానేశాడు. దీనికి ఊళ్ళోవాళ్ళు చాలాచాలా అర్థాలు తీశారు. రైతురామయ్యకు మాత్రం ఏఅర్థమూ తెలియదు! జరిగే వాటన్నింటినీ చూస్తూండటమే రామయ్యవంతు. "ఏం బావా! కొత్తకోడలు ఏమంటోంది?" అని ఎవరన్నా అంటే "దానికేంరా మాలచ్చి" అంటాడు.

జీవితంలో వొడిదుడుకులన్నింటినీ తట్టుకుని పెద్దకొడుకు కాపురం నిలవదొక్కుకునేనాటికి ఏడెకరాలమాగాణీ మిగిలింది. రామయ్యే మంచి రైతు అనుకుంటే పెద్దకొడుకు రామయ్యను మరిపించాడు. మాగాణికాగా మిగిలిన ఎకరం మెట్టభూమిలో రకరకాల పండ్లమొక్కలూ, పూల మొక్కలూ వేశాడు.

తుమ్మబీళ్ళను పసుపు తోటలుగా మార్చడానికి కారణం రైతు రామయ్య. అట్లాగే మాగాణి సాగులో ఆధునిక పద్ధతులను ప్రవేశ పెడుతున్నవాడు పెద్దకొడుకు. మాగాణిసాగు తేలిక. పనితక్కువ. పసుపుతోటలు వేసే రైతుకు మాగాణిసాగు చూస్తే 'ఇదేం వ్యవసాయం' అని పిస్తుంది. పెద్దకొడుకుమాత్రం అట్లా అనుకోకుండా యేదో పని కల్పించుకొంటూనే ఉన్నాడు.

రామయ్యజీవితంలో సంక్రాంతి. పెద్ద కొడుకుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడిపేరు చంద్రయ్య. రెండవవాడి పేరు వెంకయ్య. చదువుకున్న రైతు తన పిల్లలకు ఇటువంటి పేర్లు పెట్టడం ఆశ్చర్యమే. పెద్ద కొడుకుకు ఇటువంటి సంస్కారం అలవడడానికి కారణం అతని భార్య అంటారు కొంతమంది పెద్దలు. కాదు, రైతు రామయ్యే కారణం అని ఇంకా కొందరు అంటారు. ఏమైనా రామాయపాలెంలో రైతు రామయ్య దో సంస్కారం, ఆయన పెద్ద కొడుకు దో సంస్కారం, చిన్న కొడుకు దో సంస్కారం. ఊళ్ళో వాళ్ళకి ఇదంతా విచిత్రం. అట్లా విచిత్రంగా తోచడం ఒక కారణమన్నారు. ఐతే ఇన్నిరకాల సంస్కారాలు ఒక్క పల్లెటూళ్ళోనే ఉంటే భారతదేశం మొత్తంమీద ఎన్ని రకాల సంస్కారాలు ఉంటయ్యో ?

సంక్రాంతికూడా భారతదేశ సంస్కారాలలో ఒకటి. రైతుల సంస్కారం సంక్రాంతి. క్రాంతికోసం అర్రులు చాచేవారికి రైతు రామయ్య హృదయం అర్థంకాదు.

రైతు రామయ్య అనేవాడు అక్షరజ్ఞాన మెరుగని అనుభవైక వేద్యమైన సంస్కారానికి చిహ్నం. ఆ సంస్కారం తాలూకు సంయమనం అంతరించిపోతోంది. రైతు రామయ్య బాధ అది. ఆవేదన అది. సంసారంలో ఎన్నెన్ని మార్పులు వస్తున్నా, వచ్చినా, అంతర్వాహినిగా రామయ్యలో నిలిచి ఉన్న ఆవేదన అది. రాజకీయా లెరుగని, ఆధునిక విజ్ఞాన మెరుగని ఆవేదన అది. చదువుకున్న కొడుకులన్నా, వారి పద్ధతులు తనకు గిట్టకపోయినా, వారితో తగాదాపడని సంస్కారం రైతు రామయ్యది. చూపు సరిగా ఆనక పోయినా, చెవులు సరిగా వినిపించకపోయినా, మనవళ్ళను దగ్గర కూర్చోపెట్టుకుని పెద్దబాలశిక్ష చెపుతాడు. వాళ్లు బళ్ళోకి వెళ్తున్నారు. బాగా చదువుకొంటున్నారు. అయినా తిథులూ, తెలుగు సంవత్సరాలూ చెప్తాడు రైతు రామయ్య. వద్దనదు కోడలు.

వీటన్నిటికీ ఏం వచ్చెగాని చిన్నకొడుకు తనతో ఎందుకని మాట్లాడ డనే ఆవేదన ఈమధ్య ఎక్కువైంది రైతు రామయ్యకు. పండగకు ఆడపిల్ల లందరూ వచ్చారు. ఊళ్ళోఇల్లు ఎవరికో అద్దెకుఇచ్చాడు.

రెండో కొడుకు నాలుగేండ్లుగా అసలు ఊళ్లోకే రావటంలేదు. ఏదో పెద్ద ఉద్యోగంలోనే ఉన్నాడని వాళ్లూ వీళ్ళూ చెప్పగా విన్నాడు రామయ్య. నలుగురు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా. తండ్రితో తమ్ముడు తగాదాపడ్డాడు. ఈ సంసారానికి ఇంత నష్టం వచ్చినా తమ్ముడు ఆదుకోలేదు.

వాడి సంగతే వాడికి తప్ప తండ్రి సంగతి పట్టించుకోలేదని తమ్ముడిమీద అన్నకు కోపం. కనుకనే తమ్ముడుకూడావస్తే బాగుంటుందని పెద్దకొడుకుతో రామయ్య అనలేదు. కాని కోడలుమాత్రం ముసలాయనధోరణి కనిపెట్టి, వాళ్ళను పండగకు పిలవమని భర్తకు చెప్పింది. వినీవిననట్టు ఊరుకున్నాడు పెద్దకొడుకు. వేరేవెళ్ళమని తను చెప్పలేదు. తండ్రి చెప్పలేదు. ఏ కారణంవల్లనైతేనేం, తెగతెంపులు చేసుకువెళ్ళాడు తమ్ముడు. అది లోకంలో మామూలుగా జరిగే సంగతే. అంతమాత్రాననే తండ్రిని పలకరించడం ఎందుకని మానేశాడూ ?? రక్తసంబంధాన్ని ఎట్లా తెంచుకున్నాడూ ?? అంతగా తెగతెంపులు చేసుకున్నవాణ్ణి తను ఎందుకు పిలవాలి ? వాడిమాత్రం చదువు తనూ చదివాడు. ప్రయత్నిస్తే తనకూ పెద్ద ఉద్యోగమే వచ్చేది. అదోరకం అతిశయం. పాత నమ్మకాలను వదులుకొని కొత్తనమ్మకాలు కుదరని అతిశయం. అటువంటి అతిశయంలో ఉన్నవాళ్ళ దగ్గరికి వెళ్ళి మంచిచెప్పినా ప్రమాదమే. అదీకాక, వాళ్లు చెప్పేదీ ఒప్పుకోవచ్చు. తండ్రి మాటలూ నమ్మవచ్చు. తండ్రి కారణంగా తనకు కొంతనష్టమే వచ్చింది. అట్లా నష్టపడకుండా ఉండేందుకే వాడు జాగ్రతపడ్డాడేమో ? ఇదంతా వట్టి పిచ్చిగాని, నష్టం ఏమిటీ? ఇదంతా తండ్రి స్వార్జితం. నష్టం అనేదే జరిగితే తండ్రికే జరిగింది. ఏమైతేనేం, అభిమానమే ప్రధానమైతే తనకూ అభిమానం ఉన్నది కదా ?

తెల్లవారితే భోగి.

ఇల్లంతా కామాయమ్మనాటి మాదిరిగా కలకలలాడు తోంది. అల్లుళ్లు కూడా వచ్చారు.

రైతు రామయ్య ఇల్లు తాతలనాటిదే అయినా ఈ సంక్రాంతివల్ల ఆఇంట్లోకి ఏదో నూత్నశోభ వచ్చింది. పురో గమనంగా చలామణిఅవుతున్న పద్ధతులవల్ల మారని ఆనంద మేదో ఆ ఇంట్లో తొణికిసలాడుతోంది. కాలానికి అందని అలంకారమేదో తొణికిసలాడుతోంది ఆ ఇంట్లో. ఆ తాతల నాటి కొంపకారణంగా ఆవూరికే ఓ కొత్తశోభ వచ్చిందని పిస్తోంది.

సంతోషంలో పాతసంగతులు గుర్తుకొస్తయ్. ఆనందం ఎక్కువై రైతురామయ్య రామదాసు కీర్తనలూ, తరంగాలూ, బైబుల్ పాటలూ పాడుతున్నాడని ఇంట్లో అందరూ అనుకుంటున్నారు.

అర్ధరాత్రిఅయింది. వాకిట్లో రెండు జట్కాలు ఆగినవి. వసారాలో పడుకున్న రామయ్యకు మెలకువ వచ్చింది. సరిగా ఆ బండ్లకోసమే ఎదురుచూస్తున్నవాడిమాదిరిగా లేచి కూర్చున్నాడు. "ఎవరు వారు" అనలేదు. ఎవరువచ్చారో తెలిసినవాడి మాదిరిగా మంచంమీదనే కూర్చున్నాడు.

కోడలూ, పిల్లలూ బండిదిగి వరండాలోకి వచ్చారు. చప్పుడుకు మెలకువ వచ్చింది కామాలు, పెద్దకోడలు లేచి వచ్చి తలుపు తీసింది. 'లోపలికిరండి అక్కయ్యా' అన్నది.

అంతలో బండ్లవాళ్లను పంపించి చిన్నకొడుకు లోపలికి వచ్చాడు.

"నాన్న ఇక్కడేనా పడుకోడం?" అన్నాడు.

"ఆయన అక్కడే పడుకుంటారు. ఇంక ఎక్కడా పడుకోరు" అని అన్నది పెద్దకోడలు. చాలారోజుల ఆప్యా యత ఉన్నట్లు పిల్లలు పోయి తాతమీద పడ్డారు. తాత కూడా పిల్లలందరినీ ఆప్యాయతగా లాలించాడు. అంతే... తండ్రిని కొడుకు పలకరించ లేదు; కొడుకును తండ్రి పలక రించ లేదు.

అందరూ సర్దుకొని పడుకున్నారు ఇంట్లో.

తెల్లవారు జామున మంగలివచ్చి తలంటు పోస్తు న్నాడు.

గడ్డివామి దగ్గర పిల్లలందరికీ చేర్చి భోగిమంట వేశాడు రైతు రామయ్య.

ఆ భోగిమంటలో సంక్రాంతిని చూస్తున్నాడు రైతు రామయ్య. ఆ వేళ కావేషాల నెరుగని ఆ పసి హృదయా లకుకూడా భోగిమంటలలో సంక్రాంతి, క్రాంతికనిపిస్తున్నయ్. సంక్రాంతిలో క్రాంతి ఉన్నది. రైతుల పండగలన్నింటిలో సంక్రాంతి ఉన్నదని అంటున్నాడు రైతురామయ్య. ఆ పసి పిల్లలకేకాదు, పెద్దలకైనా ఆ మాటలు అర్థం అవుతయ్యా! స్వారాజ్యరథం కదిలింది. రైతురామయ్య వాకిట్లోకి వచ్చింది. తన పిల్లలు ఈ సంక్రాంతి సంబరంలో ఆరథ చక్రాలకింద పడతారేమోనని భయం రైతు రామయ్యకు!